క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి



ఇబ్రహీంపట్నం: రైతుల ప్రయోజనార్థం ఈక్రాప్ నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ అడిషినల్ డైరెక్టర్ వి.విజయ లక్ష్మి అన్నారు. ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని పంటల సాగు వివరాలు, వర్షపాతం నమోదు, సాగు చేయదగిన బీడు భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈక్రాప్ నమోదులో ఎదురవుతున్న పలు సమస్యలను గ్రామ వ్యవసాయ సహాయ అధికారులు ఆమెకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతపై చర్చించారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.నాగమణి, మైలవరం డివిజన్ ఏడీ ఎం.శ్రీనివాస్, ఏఓ శైలజ, టెక్నికల్ వ్యవసాయాధికారి వాసుదేవ్ నాయక్ పాల్గొన్నారు.

వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నూజివీడు: నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శనివారం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నియోజకవర్గ కోఆర్డినేటర్ రవీంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. మోడల్ కండక్ట్ ఆఫ్ స్కూల్ అసెంబ్లీ, స్కూల్ గేమ్స్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్, ఇండోర్ గేమ్స్, చదరంగం నియమ నిబంధనలు, యోగాసన, కబడ్డీ, అథ్లెటిక్స్, ట్రాక్ ఈవెంట్స్ తదితర అంశాలపై చర్చించారు. ఇన్‌చార్జి హెచ్ఎం పద్మ, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతి దాడిలో మహిళకు గాయాలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో శనివారం కోతి దాడి చేయడంతో బేతపూడి రోహిణి అనే మహిళ గాయపడింది. తన ఇంటి ఆవరణలో పనులు చేసుకుంటున్న క్రమంలో ఆమెపై కోతి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆమె కొండపల్లి పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుంది. ఇటీవలి కాలంలో కిలేశపురం గ్రామంలో కంతేటి మనోజ్ అనే యువకుడిపై కోతులు దాడి చేశాయి. బాధితుడు ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో నెలరోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. విసన్నపేటలో జరిగిన దాడిలో కూడా బాలుడు తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. గ్రామాల్లో కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): తుమ్మలపాలెం గ్రామంలో ఇటీవల పడవ ప్రమాదంలో మృతిచెందిన లంకే అన్నవరానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం మంజూరు చేసింది. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ రూ.5 లక్షల చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మధుమేహ రోగులకు వైద్య శిబిరం

తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తామని జేవీవీ ప్రతినిధులు హరికృష్ణ, పాపారావు తెలిపారు. ఫ్యాక్టరీ సెంటర్‌లోని నాగార్జున స్కూల్ ఆవరణలో తెల్లవారు ఝామున ఐదు నుంచి వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు. రక్తపోటు, మధుమేహం, మూర్ఛ వ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు సరిపడా మందులు ఇస్తామని చెప్పారు.

మృతుల కుటుంబాలకు స్వామిదాసు పరామర్శ

గంపలగూడెం: గంపలగూడెంలో ఇటీవల మృతిచెందిన స్వాతంత్య్ర సమరయోధులు సువారపు కృష్ణమూర్తి భార్య స్వరాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు శనివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబీకులైన వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్. చంద్రశేఖరరావు, వెంకటేశ్వరరావు, విశ్వనాథరావుతో మాట్లాడారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు ఆడెపు కోటేశ్వరరావు, శ్రీనివాసాచార్యుల తండ్రి ఆడెపు వెంకటాచారి(72) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. వెంకటాచారి మృతదేహాన్ని సందర్శించిన స్వామిదాసు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యపై పెల్లుబికిన ఆగ్రహం

- పలుచోట్ల వైద్య సిబ్బంది నిరసన ర్యాలీలు
- నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నూజివీడులోని ఏరియా ఆస్పత్రి గేటు వద్ద ఆందోళన చేస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది



జి.కొండూరులో వైద్యులు, సిబ్బంది ర్యాలీ



ఇబ్రహీంపట్నంలో వైద్యులు, సిబ్బంది నిరసన



తిరువూరులో ఐద్వా ఆధ్వర్యంలో మానవహారం



ముసునూరులో వైద్య సిబ్బంది మానవహారం

జి.కొండూరు: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్య ఘటనపై వైద్య సిబ్బంది ఆగ్రహం వ్యక్తంచేశారు. మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల్లో శనివారం వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఘటనపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల ర్యాలీలు జరిగాయి. జి.కొండూరు మండల పరిధిలోని జి.కొండూరు, వెలగలేరు పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బంది శనివారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.కొండూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రసన్నరాణి, డాక్టర్ శ్వేత, వెలగలేరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుష్మ, డాక్టర్ విజయ, డాక్టర్ నిరంజన్, డాక్టర్ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాథమిక కేంద్రాల పరిధిలోని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఆర్.పద్మావతి, ఫర్హీన్ మాట్లాడుతూ మెడికోలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. తక్షణమే హంతకులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

■ నూజివీడు: నూజివీడు ఏరియా ఆస్పత్రి వద్ద శనివారం వైద్యులు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్ మాట్లాడుతూ వైద్యుల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని వైద్యులు, వైద్య విద్యార్థుల రక్షణకు పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలన్నారు. మృతిచెందిన వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏరియా ఆస్పత్రిలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

■ కొండూరు: ఎ.కొండూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కేజీబీవీ విద్యార్థులు స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎ.కొండూరు సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారి స్వాతి, సూపర్‌వైజర్ మురళి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

■ ఆగిరిపల్లి: సగ్గురులో పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల ఆధ్వర్యంలో శనివారం వైద్య సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆగిరిపల్లిలో ఆర్ఎంపీల మండల అధ్యక్షుడు కోసూరు రవిశంకర్ ఆధ్వర్యంలో మండలంలో ఆర్ఎంపీలు 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపి నిరసన తెలిపారు.

■ తిరువూరు: తిరువూరు వాహినీ కాలేజీ వద్ద అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం మానవహారం నిర్వహించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చట్టాలను కఠినతరం చేయాలని, నిందితులను శిక్షించి మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా నాయకులు కుమారి, లక్ష్మి, నాగమణి డిమాండ్ చేశారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు మోహన్‌కృష్ణ, విద్యార్థినులు పాల్గొన్నారు.

■ ముసునూరు: ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా ఆధ్వర్యంలో సిబ్బందితో భారీ ర్యాలీ, మండపం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని, ఈ తరహా ఘటనలు దేశంలో మరెక్కడా జరుగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విస్సన్నపేట: వైద్యులు, ఆరోగ్య సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళలపై, వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రుల వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చౌటపల్లి(తిరువూరురూరల్): తిరువూరు మండలం చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కొవ్వొత్తులతో వైద్యుల ర్యాలీ



తిరువూరు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి వైద్యులు కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. బోస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. కోల్‌కతా ఘటనకు నిరసనగా ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు వైద్య పరీక్షలను బహిష్కరించి ఆస్పత్రులను బంద్ చేయగా, అత్యవసర కేసులను మాత్రమే అనుమతించారు. ప్రభుత్వాస్పత్రుల్లో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. వైద్యులు తాళ్లూరి రామకోటేశ్వరరావు, కొడాలి శ్రీనివాసరావు, వల్లభనేని రవీంద్ర, చంద్రశేఖరరెడ్డి, శృతి పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాలి



మైలవరంలో ర్యాలీలో పాల్గొన్న కోయ సుధా, డాక్టర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది

మైలవరం: వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాలని మైలవరం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయప్రకాష్ అన్నారు. కోల్‌కతా ఘటనను నిరసిస్తూ మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధా, ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మైలవరం బ్రాంచ్ సభ్యులు, హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు, ఆశ వర్కర్లు, వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, సీఐటీయూ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం

నూజివీడు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి జడ్జి పెదఖాసిం మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమని, బాల్య వివాహాలు చేసిన వారితో పాటు సహకరించిన వారు సైతం శిక్షార్హులవుతారని చెప్పారు. ప్రతి ఒక్కరూ జీవితంలో స్థిరపడిన తరువాతే వివాహం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. వాహనాలను నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. 14 ఏళ్ల వయస్సు వచ్చే వరకు పిల్లలు బడిలోనే ఉండాలని, ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం శిక్షార్హులవుతారన్నారు. గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని చెప్పారు. స్థిర ఆస్తులు కొనుగోలు చేసేటప్పుడు లింకు డాక్యుమెంట్లు సరిగా ఉన్నాయా, లేదా అనే విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించుకోవాలని, అన్నీ సక్రమంగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐపీసీ, సీఆర్‌పీసీ స్థానంలో నూతన చట్టాలను తీసుకొచ్చిందని, వాటి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్ ఉపాధ్యాయులు జడ్జిని సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు



బోర్వంచలో ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న హబీబ్ బాషా

నూజివీడు: ప్రతి ఒక్క రైతు సాగు చేసిన పంటను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్‌బాషా అన్నారు. బోర్వంచలో శనివారం పత్తి పైరును ఆయన పరిశీలించి ఈ పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. విత్తనోత్పత్తి పత్తి రకాలకు, కమర్షియల్ పత్తి రకాల సాగుకు అయ్యే ఖర్చులు, ఆదాయం వివరాలను రైతులతో చర్చించి వారికి పలు సూచనలు అందజేశారు. మండల వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, వీహెచ్ఏ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

■ ఆగిరిపల్లి: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. ఆగిరిపల్లి, వడ్లమానులో పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యవసాయ అధికారి చెన్నారావు, ఏఈఓలు, ఆర్ఎస్ కె ఇన్‌చార్జులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు లాక్కుంటే సహించేదిలేదు

కోడూరు గ్రామ మామిడి రైతుల హెచ్చరిక



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జి.కొండూరు: ఐదు దశాబ్దాలుగా తాము సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం లాక్కుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని కోడూరు గ్రామానికి చెందిన మామిడి రైతులు అన్నారు. వివరాలలోకి వెళ్తే...కోడూరు గ్రామ పరిధిలో ఉన్న 120 ఎకరాల రెవెన్యూ పోరంబోకు భూమిని అదే గ్రామానికి చెందిన బడుగు, బలహీన వర్గాల రైతులు గత 50 ఏళ్లుగా మామిడి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆ భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకునేందుకు ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఇటీవల పరిశీలించారు. ఈ క్రమంలో నర్సరీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆ భూమిని వెనక్కి తీసుకునేందుకు పావులు కదుపుతోందని రైతులకు అనుమానం వచ్చింది. దీనితో ఆ భూమిలో మామిడి సాగు చేస్తున్న 60 మంది రైతులు తమ భూములను లాక్కోవద్దంటూ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బోధనా శైలి మెరుగుపర్చుకోవాలి

ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు

గంపలగూడెం: ఉపాధ్యాయులు తరగతి గదుల్లో బోధనాశైలి మెరుగుపరుచుకోవాలని గంపలగూడెం ఎంఈఓ-2 పీవీడీఎల్ నరసింహారావు అన్నారు. మండలంలోని నాలుగు కాంప్లెక్స్‌లలో శనివారం ప్రారంభమైన శిక్షణా కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నదే శిక్షణ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. ఉపాధ్యాయులు నూతన టెక్నాలజీని ఉపయోగించి చదువు చెప్పే విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరినీ ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. గంపలగూడెం, ఊటుకూరు కాంప్లెక్స్‌లలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ, తిరువూరు, గంపలగూడెం, ఎ. కొండూరు మండలాల పరిధిలోని యూపీ, ఉన్నత పాఠశాలలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయులకు గంపలగూడెం హైస్కూల్‌లో, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు పెనుగొలను కాంప్లెక్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ముసునూరు: విద్యార్థులకు విషయ బోధనలో మెరుగైన విధానాలు పాటించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు, రమణక్కపేట, వేల్పుచర్ల హైస్కూళ్లలో హెచ్ఎంలు సునీల, రామకృష్ణారావు, శ్రీనివాస్‌ల అధ్యక్షతన శనివారం కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, తెలుగు, జీవ శాస్త్ర స్కూల్ అసిస్టెంట్లకు విషయ బోధనలో మెలకువలు పాటిస్తూ, పాఠ్య ప్రణాళిక, బోధనా సామగ్రిని ఉపయోగిస్తూ బోధించాలని సూచించారు. కార్యక్రమాల్లో రిసోర్స్ పర్సన్స్, సీనియర్ ఉపాధ్యాయులు దేవరపల్లి బెనర్జీ, కాసాని గాంగేయుడు పలు అంశాలను వివరించారు.

ఐటీ రంగంపై అవగాహన పెంపొందాలి



మాట్లాడుతున్న వెంకట అవినాష్

మైలవరం: ఐటీ రంగంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఒడెన్ కంపెనీ సీఈఓ జె. వెంకట అవినాష్ అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సైన్స్ సమాజానికి ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తుందని, ముఖ్యంగా ఐటీ రంగంలో ఎంతో వేగంగా కోడ్ అభివృద్ధి చేయడంలో హిట్‌హబ్ ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. కోడింగ్ ప్రపంచంలో విద్యార్థులకు అతి సులువుగా కోడ్ చేయడంలో, సాంకేతిక సాఫ్ట్‌వేర్‌లో అనేకమంది కలిసి 9 ప్రాంతాల నుంచి ఒకే ప్రాజెక్టుపై ఎలా కలిసి పనిచేయాలి అనే విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఐ, డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఓ. రమాదేవి, డాక్టర్ వి. సూర్యనారాయణ, కిరణ్, ప్రొఫెసర్స్ కె. సుధాకర్, కె. సౌజన్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మైలవరం: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్ అన్నారు. చంద్రాల పంచాయతీ శివారు సీతారామపురం తండాలో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది మూడు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. డ్రెయినేజీల్లో నీరు నిల్వ ఉన్న చోట్ల ఆయిల్ బాల్స్ వేశారు. మలాథియాన్ మందును పిచికారీ చేశారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీపీఎం నేత దుర్గారావుకు నివాళి

నూజివీడు: సీపీఎం సీనియర్ నేత, నూజివీడు కమిటీ సభ్యులు యెలినేని దుర్గారావు శుక్రవారం మృతిచెందారు. సీపీఎం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, పట్టణంలోని వర్తక వాణిజ్య సంఘాల నాయకులు దుర్గారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు దుర్గారావు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు జరిగాయి. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, రాష్ట్ర నాయకులు బీఆర్ తులసీరావు, రైతు సంఘం నాయకులు యెలినేని కేశవరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ. రవి, సీపీఐ, బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రేపు దంత వైద్య శిబిరం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహిస్తామని అసిస్సీ సేవా సదనం సభ్యులు మురళి తెలిపారు. తిరువూరుకు చెందిన వైద్య నిపుణులు బండి నరసింహారావు శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తారని చెప్పారు. దంత సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యులు వివరిస్తారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే శ్రీనివాసరావు



ఎమ్మెల్యే శ్రీనివాసరావుతో ఆర్యవైశ్య సంఘ సభ్యులు

చంద్రుపట్ల (విస్సన్నపేట): గ్రామాల్లో సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చంద్రుపట్ల కొర్రాతండాలో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు తిరువూరులో అంబేడ్కర్ స్టడీ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం విస్సన్నపేట సీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ నూతన సభ్యులను నియమించారు. సీహెచ్‌సీ నూతన సభ్యులుగా మురుగుల ప్రసాద్, వడ్లమూడి చంటి, సాంబారు నాగలక్ష్మి నియమితులయ్యారు. వీరిని ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం మండలంలోని నరసాపురం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు.

నేతల విగ్రహాలు ఏర్పాటు చేయాలి..

తిరువూరు: జాతీయ నాయకులు పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలను తిరువూరు పట్టణంలోని రాజుపేటలో ఏర్పాటు చేయాలని ఆర్య వైశ్య సంఘ సభ్యులు ఎమ్మెల్యే శ్రీనివాసరావును శనివారం కోరారు. గతంలో దివంగత మిట్టపల్లి రంగయ్యగుప్తా పొట్టి శ్రీరాములు విగ్రహం, స్మృతివనం ఏర్పాటుకు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైందని, విగ్రహాల ఏర్పాటుకు ఆక్రమణలు తొలగించాలని ఆర్య వైశ్య సంఘ సభ్యులు నాళ్లా సురేంద్ర, మిట్టపల్లి రంగనాథ గుప్తా, గుడిమెట్ల మురళి కోరారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు గుర్తించాలి

ఎంపీపీ కొండా దుర్గాభవాని

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు గుర్తించాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభలపై ముందస్తు సమావేశం శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ నెల 23న అన్ని గ్రామాల్లో జరుగనున్న గ్రామ సభల్లో ప్రజలు పాల్గొని ఎక్కువ పనులు గుర్తించేలా చర్యలు చేపట్టాలని, ఉపాధి కూలీలకు అధిక పని దినాలు కల్పించి, సకాలంలో వారికి కూలి నగదును అందించాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ పి.గంగాధర్, ఈసీ జయప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శోభనాచలుని శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహుడు

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పవిత్రోత్సవాల సందర్భంగా శనివారం స్వామి వారికి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష అర్చన, మూలా మంత్ర హోమం, పవిత్రములు విసర్జన, పూర్ణాహుతి పూజా కార్యక్రమలను ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబు పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

సెప్టెంబర్ 20 నుంచి జాతీయ స్థాయి కోడింగ్ పోటీలు



ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో సెప్టెంబర్ 20, 21 తేదీల్లో జాతీయ స్థాయిలో కోడింగ్ పోటీలు నిర్వహిస్తామని కళాశాల చైర్మన్ రావి వెంకటరావు తెలిపారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్‌రావు, అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

ముసునూరు: రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని కేడీసీసీ డీజీఎం శ్రీనివాస్ అన్నారు. గోగులంపాడు వ్యవసాయ సొసైటీని శనివారం ఆయన సందర్శించారు. సొసైటీలో కంప్యూటరీకరణ ద్వారా జరుగుతున్న కార్యకలాపాలపై తనిఖీ నిర్వహించి సిబ్బందికి సూచనలు చేశారు. ఏలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.